
# భవనంలో శిలాఫలకం ఏర్పాటు



గెస్ట్‌హౌస్ లోపల ఏర్పాటు చేసిన శిలాఫలకం

## 'నమస్తే తెలంగాణ' ఎఫెక్ట్

అశ్వారావుపేట, జూన్ 30: మండలంలోని నారంవారిగూడెం సమీపంలో ఆయిల్‌ఫెడ్ నిర్మించిన గెస్ట్‌హౌస్ భవనంలో బయట తొలిగించిన శిలాఫలకాన్ని లోపల ఏర్పాటు చేశారు. గెస్ట్‌హౌస్ పూర్తయిన తర్వాత భవనాన్ని అప్పటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేశారు. కొన్ని నెలల తర్వాత దానిని తొలిగించి లోపల ఏర్పాటు చేశారు. కానీ అధికారులు అక్కడ నుంచి కూడా దానిని తీసివేసి భద్రపరిచారు. అయితే, ప్రధాన ద్వారం వద్ద ఉండాల్సిన శిలాఫలకాన్ని తొలిగించారనే విషయంపై 'నమస్తే తెలంగాణ' ఆదివారం ఓ కథనాన్ని ప్రచురితమైంది. దీంతో అప్రమత్తమైన ఆయిల్‌ఫెడ్ అధికారులు.. వెంటనే భవనం లోపల తొలిగించిన ప్రదేశంలోనే తిరిగి శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఈ విషయమై 'నమస్తే'తో గెస్ట్ హౌస్ ఇన్‌చార్జి నాగబాబు మాట్లాడారు. శిలాఫలకం ధ్వంసమవుతుందనే ఉద్దేశంతోనే బయట తొలిగించి లోపలి ప్రదేశంలో ఏర్పాటు చేసినట్లు వివరణ ఇచ్చారు.

# సమాజంలో మార్పు కోసమే కొత్త చట్టాలు

## - ఎస్పీ రోహిత్ రాజు



కొత్తగూడెం క్రైం, జూన్ 30 : అధునాతనంగా మార్పు చెందుతున్న సమాజంలో చట్టాల సవరణ, కొత్త చట్టాల అమలు మెరుగైన భవిష్యత్ నిర్మాణానికి దోహదపడుతుందని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కొత్త చట్టాల వల్ల దర్యాప్తులో వేగం పెరగడంతోపాటు బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందన్నారు. దేశ అంతర్గత భద్రత ఈ మూడు కొత్త చట్టాల ద్వారా కొత్త శకం ప్రారంభంకానున్నట్లు తెలిపారు. ప్రజలకు మరింత సమర్థవంతంగా మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని, ఈ మూడు నూతన చట్టాల్లో సమకాలిన కాలం, వాడుకలో ఉన్న సాంకేతికకు అనుగుణంగా అనేక కొత్త నిబంధనలు చేర్చినట్లు పేర్కొన్నారు. బాధితుల హక్కులను పరిరక్షించడమే ప్రధాన ధ్యేయంగా ఈ చట్టాలను రూపొందించారని, బ్రిటీష్‌కాలం నాటి చట్టాలను మార్చి, ప్రస్తుత సమాజానికి అనుగుణంగా భారత ప్రభుత్వం కొత్త చట్టాలను తీసుకొచ్చిందన్నారు. ఈ కొత్త చట్టాలపై జిల్లా పోలీస్‌శాఖలోని అధికారులు, సిబ్బందికి ఇప్పటికే శిక్షణ తరగతులు నిర్వహించి అవగాహన కల్పించినట్లు తెలిపారు.

# లక్ష్మీదేవిపల్లిలో అరుదైన అడవి వాలుగ ప్రత్యక్షం

లక్ష్మీదేవిపల్లి, జూన్ 30: భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డ పంచాయతీ ఎస్సీ కాలనీలో అరుదైన అడవి వాలుగ (అలుగు) ప్రత్యక్షమైంది. వర్షం కారణంగా ఆదివారం ఈ వాలుగ గ్రామంలోని ఇళ్లలోకి రావడంతో తొలుత గ్రామస్తులు భయాందోళనకు గురయ్యాడు. తరువాత అది వింత జీవి అంటూ ప్రచారం జరిగింది. ఆ తరువాత కొందరు వచ్చి దీనిని అరుదైన అడవి వాలుగ (అలుగు)గా గుర్తించారు. దీని వల్ల ప్రమాదమేమీ ఉండదని చెప్పడంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు. వెంటనే కొందరు యువకులు దానిని పట్టుకొని అటవీ అధికారులకు సమాచారం అందించారు.



గ్రామస్తులు పట్టుకున్న అడవి వాలుగ (అలుగు)

# వేలాన్ని అడ్డుకుంటాం

- బొగ్గు బ్లాకులు ప్రైవేట్ చేతుల్లోకి వెళ్లనిచ్చే ప్రసక్తే లేదు
- సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారితే ఊరుకునేది లేదు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గట్టిగానే బుద్ధి చెబుతాం
- 'నమస్తే'తో టీబీజీకేఎస్ నూతన అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి



'సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తున్నది. ప్రైవేట్‌కు అప్పనంగా కట్టబెట్టి సంస్థ మనుగడను, 40 వేల మంది కార్మికుల భవిష్యత్‌ను ప్రశ్నార్థకంగా మార్చాలని చూస్తున్నది. ఇటీవలి పరిణామాలు చూస్తే దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సపోర్టు చేస్తున్నట్లు కనిపిస్తున్నది. మరో పోరాటం చేసైనా సరే బొగ్గు బ్లాకులు వేలాన్ని అడ్డుకుంటాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గట్టిగానే బుద్ధి చెబుతాం' అని టీబీజీకేఎస్ నూతన అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వేలానికి వ్యతిరేకంగా సోమవారం నుంచి పోరుబాట పడుతున్నామని, దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్న ఆయన, ప్రైవేట్ వ్యక్తులు ఎట్టి పరిస్థితుల్లో తట్ట బొగ్గు కూడా ఎత్తకుండా అడ్డుకొని తీరుతామని స్పష్టం చేశారు. - గోదావరిఖని, జూన్ 30

ఇంటర్వ్యూ

**నమస్తే: బొగ్గుబ్లాకుల వేలంపై మీ వైఖరి ఎలా ఉండబోతున్నది?**

**రాజిరెడ్డి:** సింగరేణి బొగ్గు బ్లాక్‌లను ప్రైవేట్ వ్యక్తులకు అంటగట్టడానికి కేంద్రం ప్రయత్నిస్తున్నది. దీనికి రాష్ట్రంలోని కాంగ్రెస్ సపోర్టు చేస్తున్నట్లుగా కనిపిస్తున్నది. ఎందుకంటే ఇటీవల బొగ్గు బ్లాక్‌ల వేలంపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరై, వేలాన్ని వ్యతిరేకిస్తున్నట్లు లెటర్ ఇచ్చినట్లు చెబుతున్నరు. నిజంగా కాంగ్రెస్ ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలాన్ని వ్యతిరేకించినట్లయితే వేలానికి సంబంధించిన మీటింగ్‌కు హాజరయ్యే లెటర్ ఇవ్వాలా? మరో రోజు ఇవ్వవచ్చు కదా? ఈ విషయం చాలా అనుమానాలకు తావిస్తున్నది. ఈ కారణంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ సింగరేణిలో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఎట్టి పరిస్థితుల్లో బొగ్గు బ్లాక్‌లు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో వెళ్లకుండా అడ్డుకొని తీరుతాం.

**నమస్తే: సింగరేణి ప్రధాన సమస్యలు ఏమిటి? పరిష్కారానికి ఏం చేయబోతున్నారు?**

**రాజిరెడ్డి:** సీమాంధ్ర ప్రభుత్వాల పాలనలో సింగరేణికి తీవ్ర నష్టం వాటిల్లింది. తెలంగాణ ఏర్పాటుతో సింగరేణి సంస్థ ఒక నూతన అధ్యాయాన్ని ఆవిష్కరించేలా ముందుకు సాగుతోంది. సీమాంధ్రలో హయాంలో కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితమైన సింగరేణి థర్మల్ విద్యుత్, సోలార్ విద్యుత్, ఇతర రాష్ట్రాల్లో గనుల నిర్వహణ తెలంగాణ ఏర్పడిన అనంతరమే జరిగాయి. ఇప్పుడు సింగరేణి పరిస్థితి మళ్లీ పాత పద్ధతిలోకి వెళ్లే అవకాశం ఉంది. సంస్థ మనుగడను కాపాడేందుకు పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఎక్కువగానే ఉంది. ఎట్టి పరిస్థితుల్లో సింగరేణిలో ప్రైవేట్ వ్యక్తులు ఒక తట్ట బొగ్గు కూడా ఎత్తకుండా అడ్డుకునే విధంగా ముందుకు సాగుతాం. సంస్థలో ఇంకా అనేక సమస్యలున్నాయి. వాటిపై ఎప్పటికప్పుడు ప్రతిపక్ష కార్మిక సంఘంగా ఉండి పోరాటం చేస్తాం.

**నమస్తే: టీబీజీకేఎస్ నూతన కమిటీ ఏర్పాటుకు కారణాలేంటి?**

**రాజిరెడ్డి:** గతంలో టీబీజీకేఎస్‌లో ఉన్న ముఖ్య నాయకులు రాజీనామా చేయడంతో కమిటీ మొత్తంగా రద్దు చేసుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో సింగరేణి ఎన్నికల్లో పోటీలో లేకుండా పోవడం, తదనంతరం అనేక కసరత్తుల తర్వాత 81 మందితో కొత్త కమిటీని ఏర్పాటు చేశాం. ఇందులో నన్ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అన్ని ఏరియా నుంచి అన్ని వర్గాల వారికి సెంట్రల్ కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాం. ఇప్పుడు రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగుతాం.

**నమస్తే: యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా ఎవరు ఉంటారు?**

**రాజిరెడ్డి:** టీబీజీకేఎస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా నియమించుకోవాల్సి ఉంది. కార్మిక వర్గంతో సత్సంబంధాలు కలిగి ఉండడంతోపాటు యూనియన్‌కు పెద్ద దిక్కుగా ఉండే వారిని ఎన్నుకుంటాం. అలాగే, సంస్థలోని 11 డివిజన్‌ల్లో ఉపాధ్యక్షులను నియమించాం. త్వరలో క్షేత్రస్థాయిలో అన్ని కమిటీలు ఏర్పాటు చేసి మరోసారి సింగరేణిలో టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా అవతరించడానికి ప్రయత్నాలు చేస్తాం.

**నమస్తే: గతంలో బీఆర్ఎస్‌తో అనుబంధంగా ఉన్న మీరు ఇప్పుడేం చేయబోతున్నారు?**

**రాజిరెడ్డి:** వాస్తవంగా ఏ కార్మిక సంఘం ఏడుగురు సభ్యులతో రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పుడు వారు ఎవరికి అనుబంధంగా ఉంటామనే విషయాన్ని తెలియజేయాల్సిన అవసరం లేదు. తెలంగాణ ఏర్పాటుకు ముందు నుంచి బీఆర్ఎస్‌తోనే టీబీజీకేఎస్ కొనసాగుతూ వచ్చింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో కేంద్రంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ సింగరేణి సంస్థను అధోగతి పాలు చేయడానికి చూస్తున్నట్లుగా అర్థమవుతోంది. ఈ క్రమంలో టీబీజీకేఎస్ బీఆర్ఎస్ పార్టీతోనే అనుబంధం కొనసాగించాలని భావిస్తున్నది.

# అనగనగా ఓ సీసీ రోడ్డు.. మధ్యలో విద్యుత్ స్తంభం



నడిమిగూడెం గ్రామంలో రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ఉంచి వేసిన సీసీ రోడ్డు

- మైండ్ బ్లాంక్ అయ్యేలా సీసీ రోడ్ల నిర్మాణాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు
- ఆళ్లపల్లి మండలంలో సీసీ రోడ్ల కథలెన్నో?

ఆళ్లపల్లి, జూన్ 30 : ఆళ్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో వేసిన సీసీ రోడ్ల కథలు వింటే ఆశ్చర్యంతోపాటు ఆగ్రహం కలుగమానదు. కనీస పరిజ్ఞానం లేకుండా కాంట్రాక్టర్, ఇంజినీర్లు ఈ రోడ్లు ఎలా నిర్మించారో అర్థం కాక ముక్కున వేలేసుకుంటున్నారు సామాన్య ప్రజలు. ఇక పోతే ఏ నిధులతో నిర్మించారో తెలిపే శిలాఫలకం సైతం లేకపోవడం వారి నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం. నడిమిగూడెం గ్రామంలో సరిగ్గా నడిరోడ్డుపై విద్యుత్ స్తంభాన్ని ఉంచి రోడ్డు పూర్తిచేశారు. మర్కోడు ఎస్సీకాలనీ ముత్యాలమ్మ గుడి వద్ద సైతం రోడ్డు చివరన స్తంభం ఉంచి రోడ్డు వేశారు. పంచాయతీ, విద్యుత్‌శాఖ అధికారుల మధ్య సమన్వయ లోపం ప్రజలకు శాపంగా మారింది. జిన్నెలగూడెంలో సీసీ రోడ్డు నిర్మించిన 8 నెలలకే పగుళ్లు ఏర్పడ్డాయి. రఘువాపురం పంచాయతీ చంద్రాపురం, మర్కోడు పంచాయతీ జిన్నెలగూడెంలో జనావాసాలు లేనిచోట సీసీ రోడ్డు వేశారు. ఆళ్లపల్లి మండలం ఏజెన్సీ ప్రాంతం కావడంతో జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

## అధికారులు ఏమంటున్నారంటే..

ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈ అఖిల్‌ను ఫోన్‌లో వివరణ కోరగా.. ఈ సీసీ రోడ్ల నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా డిసెంబర్ 2023లో నిధులు మంజురయ్యాని తెలిపారు. ఫిబ్రవరి చివరినాటికి పూర్తి చేయాల్సి ఉండడంతో కరెంట్ స్తంభం తీయకుండానే రోడ్లు వేశామన్నారు. విద్యుత్ స్తంభం తీయాలంటే గ్రామ పంచాయతీలో లెటర్ పెడితే సరిపోతుందని ఉచిత సలహా ఇవ్వడం గమనార్హం. విద్యుత్‌శాఖ ఏఈ రమేష్‌ని వివరణ కోరగా.. నడిమిగూడెం, మర్కోడు పంచాయతీల్లో సీసీ రోడ్లు వేసేటప్పుడు మా శాఖకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని తెలిపారు.

# కేటీపీఎస్‌లో నిలిచిపోయిన విద్యుదుత్పత్తి

- 800 మెగావాట్ల ఉత్పత్తికి ఆటంకం




కేటీపీఎస్ ఏడోదశ కర్మాగారం

పాల్వంచ, జూన్ 30 : కేటీపీఎస్ ఏడో దశ 12వ యూనిట్ కర్మాగారంలో ఆదివారం విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. బాయిలర్ ట్యూబ్స్ లీక్ కావడంతో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని అత్యవసరంగా నిలిపివేశారు. వేసవికాలంలోనిరంతరాంగా ఉత్పత్తి చేసిన యూనిట్‌లో తరచుగా బాయిలర్ ట్యూబ్స్ లీక్ కావడంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రస్తుతం విద్యుత్‌కు డిమాండ్ తగ్గడంతో యూనిట్‌ను అత్యవసరంగా నిలిపివేశారు. టెంపరేచర్ తగ్గిన తర్వాత పనులు ప్రారంభిస్తారు. మూడ్రోజులపాటు యూనిట్‌లో బాయిలర్ ట్యూబ్స్ లీకేజీ, ఇతర విభాగాల్లో పరిశీలన చేసిన తర్వాత విద్యుత్ ఉత్పత్తి చేపట్టనున్నట్లు సీఈ తెలిపారు.

# రాబడి

మనలో చాలామంది క్రెడిట్ కార్డ్స్ వాడుతూంటారు. అయితే ఈ క్రెడిట్ కార్డుల్లో ఎన్ని రకాలున్నాయో.. వాటి లాభాలేంటో మీకు తెలుసా? బ్యాంకింగ్ రంగంలో ఉన్న ప్రస్తుత పోటీ వాతావరణంలో కస్టమర్లను ఆకట్టుకోవడం ఓ పెద్ద టాస్క్ అయిపోయింది. అందుకే యూజర్ల అవసరాలకు, అలవాట్లకు తగ్గట్టుగా ఒక్కో కార్డుకు ఒక్కో రకంగా ప్రయోజనాలను చేర్చి అందిస్తున్నాయి ఆయా సంస్థలు.

## అక్కెరకో క్రెడిట్ కార్డ్



**బేసిక్ క్రెడిట్ కార్డ్స్**
బ్యాంకులు, సంస్థలు తమ కస్టమర్లకు ఉచితంగానే ఇస్తున్నాయి. మరికొన్ని తక్కువ ఫీజును వసూలు చేస్తున్నాయి. పెద్దగా బెనిఫిట్స్ ఏవీ ఉండవు.

**రివార్డులకు..**
క్రెడిట్ కార్డ్స్‌ను ఎక్కువగా వాడేవారికి ఇవి ఉత్తమం. ప్రతీ కొనుగోలుపై రీడిమబుల్ రివార్డ్స్ యాడ్ అవుతాయి.

**క్యాష్ బ్యాక్ కోసం..**
వీటితో మనం కొనే వస్తువుల ధర కొంత మొత్తం తగ్గుతుంది. అకౌంట్లలో ఆ మొత్తా లు జమవుతాయి.

**ప్రయాణాలకు వీలుగా..**
ప్రయాణాలు ఎక్కువగా చేసేవారికి సౌకర్యంగా ఉంటాయి. ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్, హోటల్ చార్జీల్లో రాయితీ వంటివి అందుకోవచ్చు.

**వ్యాపారస్తులకు ప్రయోజనకారిగా..**
వ్యాపారులు, కంపెనీల యజమానుల కోసం వీటిని ఇస్తున్నారు. వ్యాపార లావాదేవీలపై రివార్డ్స్ పొందవచ్చు.

**విద్యార్థుల కోసం..**
పరిమిత రుణ చరిత్ర ఉన్నవారు, యువతకు లాభదాయకం. వార్షిక చార్జీలుండవు. బోనస్ పాయింట్లు వస్తాయి.

**కో-బ్రాండెడ్**
వీటితో ఉచిత హోటల్ సర్వీసునూ అందుకోవచ్చు. అయితే హై ఎండ్ కస్టమర్లకే ఇవి దొరుకుతాయి.

**స్టోర్ క్రెడిట్ కార్డ్స్**
రిటైల్ స్టోర్ల ద్వారా ఇష్యూ అవుతున్నాయి. ఎక్కడైతే లేదా ఎవరైతే ఇస్తారో అక్కడే ఈ క్రెడిట్ కార్డ్స్ చెల్లుతాయి.

**షాపింగ్ కోసం..**
ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ షాపర్స్‌కు సూటబుల్. వీటితో కొంటే డిస్కౌంట్లు, రివార్డులు, క్యాష్‌బ్యాక్ వంటి రకరకాల ఆఫర్లను అందుకోవచ్చు.

**విమాన ప్రయాణికులకు..**
విమానయాన సంస్థలతో కలిసి బ్యాంకులు వీటిని ఇష్యూ చేస్తున్నాయి. టిక్కెట్ల ధరపై రాయితీలు, రివార్డ్ పాయింట్లు అందుతాయి.

**ఇంధన వినియోగదారులకు..**
వీటితో వాహనదారులు పెట్రోల్, డీజిల్ పోయించుకున్నప్పుడు డిస్కౌంట్ పొందవచ్చు. సర్‌చార్జీలను తప్పించుకోవచ్చు.


**వినోదాలకు వెళ్లేవారి కోసం..**
సినిమాలకు తరచూ వెళ్లేవారి కోసం ఈ క్రెడిట్ కార్డులున్నాయి. సెక్యూరిటీపైనా క్రెడిట్ కార్డులను పొందవచ్చు. క్రెడిట్ స్కోర్‌తో సంబంధం లేకుండా నగదు గ్యారెంటీతో వీటిని జారీ చేస్తారు.

# పోస్టల్ జీవిత బీమాకు పోదామా..

## పీఎల్ఐ-ఆర్పీఎల్ఐకి ఉన్న ఐటీ ప్రయోజనాలేమిటి?

**భారతీయ** తపాలా కార్యాలయం (ఇండియా పోస్ట్ లేదా పోస్టాఫీస్) రెండు రకాల జీవిత బీమా పథకాలను అందిస్తున్నది. అవే.. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పీఎల్ఐ), గ్రామీణ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (ఆర్పీఎల్ఐ). భద్రత, సుస్థిరతలకు మదుపరులు ముందుగా చూసేది పోస్టాఫీస్ స్కీములనేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేట్ రంగ ఉద్యోగులకు, ఆయా రంగాల నిపుణులు, వ్యాపారులు, ఇతరత్రా వృత్తులవారికి అనేక ప్రయోజనాలను చేకూర్చే ఈ స్కీముల్లో బీమా పథకాలకు సైతం గొప్ప ఆదరణే ఉంటున్నది. వాటికి ఆదాయ పన్ను (ఐటీ) మినహాయింపులు కూడా ఉన్నాయి. పీఎల్ఐ, ఆర్పీఎల్ఐ ప్రీమియం చెల్లింపుల్లో పోస్టాఫీస్ రిబేట్‌ను ఆఫర్ చేస్తున్నది. ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ కింద పీఎల్ఐ స్కీంలో 6, 12 నెలలు లేదా ఆపై ముందస్తు పేమెంట్లకు 1 శాతం నుంచి 2 శాతం రిబేట్ వస్తున్నది. అలాగే ఆర్పీఎల్ఐ స్కీంలో 3, 6, 12 నెలలు లేదా ఆపై ముందస్తు చెల్లింపులకు 0.5 శాతం, 1 శాతం, 2 శాతం రిబేట్లు వర్తిస్తున్నాయి.


- పోస్టాఫీసుల్లో లేదా పోస్టల్ ఏజెంట్లను సంప్రదించి ఈ బీమా పాలసీలను తీసుకోవచ్చు.
- పీఎల్ఐ, ఆర్పీఎల్ఐ పాలసీదారులు తమ ప్రీమియంలను దేశవ్యాప్తంగా ఉన్న ఏ పోస్టాఫీస్‌లోనైనా చెల్లించవచ్చు. పీఎల్ఐ పోర్టల్ ద్వారా లేదా డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా, భీమ్/యూపీఐ, నెట్ బ్యాంకింగ్ ద్వారా కూడా పేమెంట్స్ చేసుకోవచ్చు. ఉద్యోగులు తమ సాలరీ అకౌంట్ల నుంచి ఆటోమేటిక్ డెబిట్ కూడా చేయించుకోవచ్చు.
- ఈ పోస్టల్ బీమా పథకాలకు 19-55 ఏండ్లవారు అర్హులు.
- పాలసీ కోసం ఫొటోలు, ప్రపోజల్ ఫామ్, వయస్సు-చిరునామా ధ్రువీకరణ పత్రాలు, ఐడెంటిటీ ప్రూఫ్, అనారోగ్యం ఉంటే వాటి మెడికల్ రిపోర్టులు అవసరం.
- సమ్ అష్యూర్డ్ పరిమితి కనిష్ఠంగా రూ.10,000, గరిష్ఠంగా రూ.10 లక్షలు.
- పాలసీ తీసుకున్న 3 ఏండ్ల తర్వాత నుంచి రుణాలు, సరెండర్ సదుపాయం ఉంటుంది.
- పీఎల్ఐలో సుమంగళ్, బాల జీవన్ బీమాలపై రుణ సౌకర్యం, సరెండర్ అవకాశం లేదు.
- గ్రామీణ పీఎల్ఐలో గ్రామ ప్రియ, గ్రామ సుమంగళ్, బాల జీవన్ బీమాలపై రుణ సౌకర్యం, సరెండర్ అవకాశం ఉండదు.
- బాల జీవన్ బీమా పథకానికి 5-20 ఏండ్లవారు అర్హులు. తల్లిదండ్రుల వయసు 18-45 ఏండ్ల మధ్య ఉండాలి. కుటుంబంలో గరిష్ఠంగా ఇద్దరి పిల్లలకే పథకం వర్తిస్తుంది. గరిష్ఠ సమ్ అష్యూర్డ్ రూ.3 లక్షలు.




| పీఎల్ఐ పథకాలు | ఆర్పీఎల్ఐ పథకాలు |
|---|---|
| హోల్ లైఫ్ అష్యూరెన్స్ (సురక్ష) | హోల్ లైఫ్ అష్యూరెన్స్ (గ్రామ సురక్ష) |
| కన్వర్టబుల్ హోల్ లైఫ్ అష్యూరెన్స్ (సువిధ) | కన్వర్టబుల్ హోల్ లైఫ్ అష్యూరెన్స్ (గ్రామ సువిధ) |
| ఎండోమెంట్ అష్యూరెన్స్ (సంతోష్) | ఎండోమెంట్ అష్యూరెన్స్ (గ్రామ సంతోష్) |
| జాయింట్ లైఫ్ అష్యూరెన్స్ (యుగళ్ సురక్ష) | పదేండ్ల గ్రామీణ పీఎల్ఐ (గ్రామ ప్రియ) |
| యాంటిసిపేటెడ్ ఎండోమెంట్ అష్యూరెన్స్ (సుమంగళ్) | యాంటిసిపేటెడ్ ఎండోమెంట్ అష్యూరెన్స్ (గ్రామ సుమంగళ్) |
| చిల్డ్రెన్ పాలసీ (బాల జీవన్ బీమా) | చిల్డ్రెన్ పాలసీ (బాల జీవన్ బీమా) |

# లాభాల స్వీకరణకు అవకాశం!

**గత** వారం దేశీయ స్టాక్ మార్కెట్లు రికార్డుల మోత మోగించాయి. వరుస ట్రేడింగ్ సెషన్లలో ఆకర్షణీయ లాభాలనే అందుకున్నాయి. అయితే చివరి రోజున మాత్రం మదుపరులు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యారు. ఫలితంగా సూచీలు నయా ఆల్‌టైమ్ హైల్లో స్థిరపడలేకపోయాయి. అయినప్పటికీ అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,822.83 పాయింట్లు లేదా 2.36 శాతం పెరిగి 79వేల స్థాయికి ఎగువన 79,032.73 వద్ద స్థిరపడింది. అలాగే ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 509.50 పాయింట్లు లేదా 2.16 శాతం అందిపుచ్చుకుని 24వేల స్థాయిని దాటి 24,010.60 దగ్గర నిలిచింది. అయితే ఈ వారం మదుపరులు లాభాల స్వీకరణకు దిగవచ్చన్న అంచనాలున్నాయి. సూచీలు దాదాపు గరిష్ఠ స్థాయిల్లో కదలాడుతుండటమే కారణం. మదుపరులు పెట్టుబడుల జోష్‌ను కొనసాగించేందుకూ వీలు లేకపోలేదంటున్నారు. జూన్ నెల వాహన విక్రయాలు, జీఎస్టీ వసూళ్లు తదితర అంశాలు మార్కెట్ ట్రెండ్‌ను ప్రభావితం చేయవచ్చు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఎప్పట్లాగే ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 23,700 పాయింట్ల స్థాయి కీలకం. దీనికి దిగువన ముగిస్తే 23,400 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చు. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 24,400-24,600 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని చెప్తున్నారు.




హెల్త్ ఇన్సూరెన్స్‌ను అందరికీ దగ్గర చేసేందుకు క్యాష్‌లెస్ చికిత్స నుంచి క్లెయిమ్ సెటిల్మెంట్ వరకు ఇటీవల పలు మార్పులను చేసింది ఐఆర్డీఏఐ.

# ఆరోగ్య బీమాలో మార్పులొచ్చాయ్

- వయసుతో సంబంధం లేకుండా అందరూ ఆరోగ్య బీమాను తీసుకోవచ్చు. సీనియర్ సిటిజన్లకు ఇది గొప్ప ఊరట.
- గుండె జబ్బు, క్యాన్సర్, కిడ్నీ వ్యాధులు, ఎయిడ్స్ రోగులకూ ఆరోగ్య బీమా.
- డిశ్చార్జి అభ్యర్థన వస్తే మూడు గంటల్లోగా బీమా సంస్థలు తుది అనుమతి ఇవ్వాలి.
- ఆయుర్వేద, యోగా, నాచురోపతి, సిద్ధ, యునానీ, హోమియోపతికీ బీమా.
- ముందున్న షుగర్, బీపీ వంటి అనారోగ్య సమస్యలకు ఇన్సూరెన్స్ కవరేజీ ఉండాలంటే పాలసీ కొన్న నాలుగేండ్ల తర్వాతే వీలుపడేది. అయితే దీన్ని మూడేండ్లకు తగ్గించారు. జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీ వంటి స్పెసిఫిక్ డీసీజ్‌లు/ప్రొసీజర్ల వెయిటింగ్ పీరియడ్ కూడా మూడేండ్లే.
- మీరు పాలసీ తీసుకున్న బీమా సంస్థతో లింకైన దవాఖానలేగాక ఇతర దవాఖానల్లో చికిత్స తీసుకున్నా క్యాష్‌లెస్ వైద్య సదుపాయం.
- ఆరోగ్య బీమాలో మారటోరియం వ్యవధిని 8 ఏండ్ల నుంచి 5 ఏండ్లకు తగ్గింపు. రెగ్యులర్ పాలసీదారుల క్లెయిమ్‌ల తిరస్కరణ తగ్గనున్నది.
- మీకు ఒకటి కన్నా ఎక్కువ పాలసీలుంటే.. చికిత్స ఖర్చును క్లెయిమ్ చేసుకోవడానికి వాటన్నిటినీ ఒకే సారి వినియోగించుకోవచ్చు.
- ఇండెమ్నిటీ ఆధారిత పాలసీలు వద్దన్న ఐఆర్డీఏఐ.. బెనిఫిట్ ఆధారిత పాలసీలనే ఇవ్వాలని ఇన్సూరెన్స్ కంపెనీలకు స్పష్టం చేసింది. దీనివల్ల పాలసీదారులకు నిర్దిష్ట దవాఖాన ఖర్చులు అందుతాయి.